పక్కాగా డిజిటల్ సర్వే: కలెక్టర్


వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, న్యూస్‌టుడే: ప్రభుత్వం జారీ చేయనున్న డిజిటల్ కార్డుల సర్వే పూర్తిస్థాయిలో పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. సోమవారం మెదక్ పట్టణంలోని 20వ వార్డులో సర్వే తీరును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కుటుంబంలోని వ్యక్తుల వివరాలన్నీ నమోదు చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 289 కుటుంబాలు లక్ష్యంగా నాలుగు బృందాలుగా విడిపోయి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు


వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అర్జీలు స్వీకరించారు. ధరణి సమస్యలపై 15, రుణమాఫీ జరగలేదని నలుగురు, రెండు పడక గదుల ఇళ్ల కోసం ఆరుగురు, ఇతర సమస్యలపై 30 మంది అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య పాల్గొన్నారు.


మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ


బతుకమ్మ ఆడుతున్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కార్పొరేషన్ ఛైర్‌పర్సన్లు, మైనంపల్లి వాణి, శివాని తదితరులు


పాట పాడుతున్న గాయని మంగ్లీ

బంతిపూలు పేర్చి.. బతుకమ్మ ఆడి..

అట్టహాసంగా సంబరాలు ● పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క


వేడుకల్లో ఎమ్మెల్యే రోహిత్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: బతుకమ్మ పాటలు.. కోలాటాలతో మెదక్ పట్టణం సందడిగా మారింది. సోమవారం పట్టణంలోని ప్రభుత్వం బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మైనంపల్లి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మన ఇంటి బతుకమ్మ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. మహిళల బతుకమ్మ ఆటలు, కోలాటాలు, గాయని మంగ్లీ ఆటపాటలతో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మంత్రులు కొండా సురేఖ, సీతక్క, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరేళ్ల శారద, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శోభారాణి, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాత, మైనంపల్లి వాణి, శివాని మహిళలతో కలిసి మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ చుట్టూ కోలాటం ఆడారు. జనం పోటెత్తడంతో మైదానమంతా సందడిగా మారింది. మంత్రి సీతక్క బతుకమ్మ ఎత్తుకోగా, మరో మంత్రి కొండ సురేఖ పాట పాడి మహిళలను ఉత్సాహపరిచారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పురపాలక అధ్యక్షుడు చంద్రపాల్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


భారీ బతుకమ్మ చుట్టూ మహిళలు

స్కందమాతగా.. వనదుర్గమ్మ..



పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన సోమవారం పసుపు రంగు వస్త్రాలంకరణలో స్కందమాత(మహాలక్ష్మి)గా దర్శనమిచ్చింది. ఆలయం వద్ద వరద ప్రవాహం ఉండడంతో రాజగోపురంలో అమ్మవారికి నిత్య పూజలు కొనసాగాయి. గోకుల్ షెడ్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

చిన్నశంకరంపేట: మండల పరిధి కొర్విపల్లి దేవాలయంలో దుర్గమ్మ గౌరీ చండికాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అంబాజీపేట, గవ్వలపల్లి, చిన్నశంకరంపేటలో దుర్గామాత మాలధార భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కొర్విపల్లిలో గౌరీ చండీకాదేవి అవతారంలో..

సభ్యత్వ నమోదులో భాజపా రికార్డు


పాల్గొన్న భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్

రామాయంపేట, న్యూస్‌టుడే: అతిపెద్ద సభ్యత్వ నమోదుగా భాజపా రికార్డు సాధించిందని ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా సోమవారం రామాయంపేటలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణలో కింది స్థాయి నుంచి కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, పట్టణ అధ్యక్షుడు భానుచందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అవినీతి జరగకుండా సామాజిక తనిఖీ

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: అవినీతి జరగకుండా చూడడమే సామాజిక తనిఖీ ఉద్దేశమని డీఆర్డీవో ఏపీడీ రంగాచార్యులు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ 14వ విడత ప్రజా దర్బార్ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సామాజిక బృందం నిర్వహించిన తనిఖీల్లో రూ.5.44 కోట్లకు గానూ రూ.10,237 అవినీతి జరుగగా, రూ.11,500 జరిమానా విధించినట్లు తెలిపారు. జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, ఎంపీడీవో రఘు, తదితరులు ఉన్నారు.

సంస్కృతికి ప్రతీక పూల పండగ


బతుకమ్మలతో న్యాయమూర్తులు లక్ష్మీశారద, రీటా లాల్‌చంద్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండగ ప్రతీక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద అన్నారు. సోమవారం మెదక్‌లోని జిల్లా న్యాయస్థానాల సముదాయ ఆవరణలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటా లాల్‌చంద్ మహిళా సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ చంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు చేసిన ఎమ్మెల్యే


కొట్టాలలో దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి మండలం కొట్టాల గ్రామంలోని రైతు మిత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలకు సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని బతుకమ్మ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ ఛైర్మన్ దుర్గారెడ్డి, భారాస మండల అధ్యక్షుడు రామాగౌడ్, మాజీ సర్పంచి లత, నాయకులు గౌరి రెడ్డి, సుధాకర్, మాధవరెడ్డి, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

సిరంజీలు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

మెదక్, న్యూస్‌టుడే: 'గుచ్చుకునేదాకా.. గుర్తించారా..?' అనే శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి వైద్యాధికారులు స్పందించారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఔషధాల స్టోర్ ముందు ఉన్న భవనంలో విచ్చలవిడిగా సిరంజీలు పడేశారు. ఈ విషయమై చిత్ర కథనం ప్రచురితం కావడంతో ఆసుపత్రి పర్యవేక్షకుడు కిరణ్ స్పందించి వాటిని అక్కడి నుంచి తొలగింపజేశారు. అనంతరం సిరంజీలను బయో ఉత్పత్తులను సేకరించే సిబ్బందికి అందజేశారు.

విద్యార్థులకు ఉపకారం

డిసెంబర్ 31తో ముగియనున్న గడువు



మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఉన్నత విద్య అభ్యసించాలని తపన ఉన్నప్పటికీ ఆర్థిక భారంతో చాలా మంది విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేస్తున్నారు. అలాంటి వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపకార వేతనాలు, బోధనా రుసుం పథకాలను ప్రవేశపెట్టడంతో ఆర్థికంగా భరోసా కలిగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు కలిసి మొత్తం 92 ఉన్నాయి. రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరం నుంచి ఎస్సీ విద్యార్థుల బోధనా ఫీజులు, ఉపకార వేతనాలు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఎస్సీ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఈ-పాస్ వెబ్‌సైట్లో దరఖాస్తులను అందుబాటులోకి తెచ్చింది. ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులు మాత్రం పూర్వ విధానంలోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలో కళాశాలల వివరాలు

మొత్తం	జూనియర్	వృత్తి విద్య	డిగ్రీ:
92	57	18	16
పీజీ: 01	గతేడాది దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు: 2405		

చేకూరనున్న ప్రయోజనం..

2021 నుంచి కేంద్ర ప్రభుత్వం ఎస్సీ విద్యార్థుల బోధనా ఫీజులు, ఉపకార వేతనాల నిబంధనలు మార్చింది. మొదట రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను జమచేస్తే, కేంద్ర ప్రభుత్వం 60శాతం మంజూరు చేస్తుంది. ఈ నిబంధనలకు రాష్ట్రంలోని గత ప్రభుత్వం అంగీకరించపోవడంతో విద్యార్థులు నష్టపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25 నుంచి కేంద్ర సంస్కరణల అమలుకు అంగీకరించింది. దీంతో జిల్లాకు చెందిన ఇంటర్, ఆపై ఉన్నత చదువులు అభ్యసిస్తున్న 2405 మంది ఎస్సీ విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

ఆధార్ తప్పనిసరి...

ఆధార్‌లోని పేరు, పదో తరగతి ధ్రువీకరణ పత్రంలోని పేరు కచ్చితంగా సరిపోవాలి. పదో తరగతి హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ, ఉత్తీర్ణత సాధించిన ఏడాది, రెగ్యులర్/ప్రైవేట్ వివరాలతో ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

- 2024-25లో కొత్తగా చేరిన, అప్పటికే చదువుతున్న వారు అర్హులు.
- మొదటి దశలో డెమోగ్రాఫిక్ మ్యాచింగ్, రెండో దశలో బయోమెట్రిక్ ధ్రువీకరణ, మూడో దశలో దరఖాస్తు పూర్తి చేయాలి. ఇదే విధానంలో కళాశాలల అనుబంధ వసతిగృహాలు, డే స్కాలర్స్ దరఖాస్తు చేసుకోవాలి.
- అనంతరం పరిశీలన కోసం కాపీలను సంబంధిత కళాశాలలో అందించాలి.

ఉచితంగా దరఖాస్తు చేస్తున్నాం

– డాక్టర్ హుస్సేన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మెదక్
– శశికళ, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా కళాశాలలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు డిసెంబర్ 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. అర్హత కలిగిన ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో సకాలంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక సహాయం పొందండి.

రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలకు ఆహ్వానం

మెదక్, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపేలా ఇటీవల తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్ తీసి ఈనెల 20వ తేదీలోపు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పీఆర్వోకు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 8712659559 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

- పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి వినతులు స్వీకరించారు.

నేడు ఖోఖో జట్ల ఎంపిక

నర్సాపూర్: నర్సాపూర్‌లోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఉమ్మడి మెదక్ జిల్లా ఖేలో ఇండియా ఖోఖో సబ్ జూనియర్స్, జూనియర్స్ జట్ల ఎంపికలు మంగళవారం జరుగుతాయని అడహక్ కమిటీ కన్వీనర్ మహేందర్‌రావు, సభ్యులు పోచప్ప, నాగరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9వ తేదీన నల్గొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అరచేతిలో ఉపాధి వివరాలు

జన్‌మన్ రేగా యాప్‌తో మేలు



న్యూస్‌టుడే, వేగుంట: ఉపాధి కూలీలకు డబ్బుల చెల్లింపులో అనేక మార్పులు జరుగుతున్నాయి. పారదర్శకతకు బ్యాంకు, తపాలా ఖాతాలో కూలీల నగదు జమ చేస్తున్నారు. కొందరి ఖాతాల వివరాలు సరిగా అనుసంధానం కాకపోవటం, తప్పుగా నమోదు కావటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూలీల కోసం కేంద్ర ప్రభుత్వం 'జన్‌మన్ రేగా' యాప్‌ను తీసుకొచ్చింది. ఇందులో సమగ్ర వివరాలను తెలుసుకునే వీలుంది.

పూర్తి సమాచారం

ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించింది. సెల్‌ఫోన్‌లో జన్‌మన్ రేగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీనిలో కూలీల హాజరు, నగదు జమ విభాగం క్లిక్ చేస్తే సంబంధిత సమాచారం తెరుచుకుంటుంది. రాష్ట్ర, జిల్లా, మండలం, గ్రామపంచాయతీ, ఉపాధి హామీ జాబ్‌కార్డు, కుటుంబ గుర్తింపు సంఖ్య నమోదు చేస్తే వివరాలు క్షణాల్లో ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పనిచేసిన రోజులు, కూలీ మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయిందో పూర్తి వివరాలు కనిపిస్తాయి. కూలీ జమ కాకపోతే కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. మరోవైపు పథకంలో చేపట్టే పనుల సమాచారం, స్థానిక అక్రమాలపై ఫిర్యాదులకు అవకాశం కూడా కల్పించారు. అన్ని భాషల్లో వివరాలు ఉంటాయి.

జిల్లాలో ఉపాధి హామీ సమాచారం

- మండలాలు: 20 ● పంచాయతీలు: 469
- మొత్తం జాబ్ కార్డులు: 1,64,183
- కూలీలు: 3,31,905
- ప్రస్తుతం పనిచేస్తున్న జాబ్‌కార్డులు: 1,17,866
- పనిచేస్తున్న కూలీలు: 2,19,225
- కొత్త జాబ్‌కార్డుల జారీ: 1,893
- కుటుంబాలకు కల్పిస్తున్న పని: 88,556

అవగాహనే ముఖ్యం

ఇప్పటివరకు చాలా మంది కూలీ డబ్బుల విషయంలో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతుంటారు. యాప్ వచ్చి దాదాపు నెల రోజులు అవుతున్నా.. చాలా మందికి ఇప్పటివరకు తెలియటంలేదు. జన్‌మన్ రేగా యాప్‌పై కూలీలతో పాటు గ్రామాల్లో అవగాహన కల్పిస్తే చైతన్యవంతులు అవుతారు.

అన్ని వివరాలు తెలుసుకోవచ్చు:

– శ్రీనివాసరావు, డీఆర్డీవో



జన్‌మన్ రేగా యాప్ వినియోగంతో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ప్రస్తుతం గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. పథకంలో చేపట్టే పనుల సమాచారం తెలుసుకోవటంతో మేలు జరుగుతుంది. దీనిలో స్థానిక అక్రమాలపై కూడా ఫిర్యాదు చేసేందుకు వీలుంది.

రీసర్వే జరిపించాలని రైతుల వినతి


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్: శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామంలో ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంలోని భూములను రీసర్వే జరిపించాక నోటీసులు ఇవ్వాలని ఆ గ్రామానికి చెందిన రైతులు కోరారు. నర్సాపూర్‌లోని రైతు వేదికలో కొంతాన్‌పల్లి, రత్నాపూర్ గ్రామాలకు చెందిన రైతులతో అవార్డు విచారణ సోమవారం నిర్వహించారు. కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చింతల కరుణాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. తిరిగి భూములు సర్వే పూర్తిచేశాక నోటీసులు ఇవ్వాలని ఆర్డీవోను కోరారు. కబ్జాలో ఉన్న రైతులకే నోటీసులు ఇవ్వాలని అన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలో మొత్తం 17 గ్రామాలకు సంబంధించి అవార్డు విచారణ పూర్తయినట్లు చెప్పారు.

అధిక ధర నిర్ణయించడానికి చొరవ

తూప్రాన్, న్యూస్‌టుడే: రీజినల్ రింగ్ రోడ్(ట్రిపుల్ ఆర్) నిర్మాణంలో భూములు కోల్పోతున్న తూప్రాన్ మండలానికి చెందిన వారితో సోమవారం ఆర్డీవో జయచంద్రా రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. నర్సంపల్లి, వెంకటాయపల్లి, గుండ్రెడ్డిపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులకు భూసేకరణ వివరాలు తెలియజేసి, వారి యాజమాన్య పత్రాలను పరిశీలించారు. బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని వారు ఆర్డీవోను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనరసింహ దృష్టికి తీసుకెళ్లి వీలైనంత ఎక్కువ ధర నిర్ణయించడానికి జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుంటారని హామీ ఇచ్చారు.

పనిచేయని గేటు.. వాహనదారులకు పాట్లు



తూప్రాన్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న బ్రాహ్మణపల్లి రైల్వేగేటు తరచూ మరమ్మతులకు గురి కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం సాయంత్రం గేటులో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. అది తెరుచుకోకపోవడంతో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. దీంతో దాదాపు అరగంట పాటు గేటు మూసి ఉండడంతో కిలోమీటర్ల మేర వందలాది వాహనదారులు నిలిచిపోయారు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తూప్రాన్

అదనులో సాగు.. దిగుబడి బాగు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్



చిక్కుడు సాగుకు చల్లని వాతావరణం అవసరం. శీతాకాలం పంటగా ప్రస్తుత తరుణంలో సాగు చేయాలని చెబుతున్నారు సంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారిణి సునీత. శీతాకాలం పంటగా అక్టోబరు-నవంబరు మాసాలలో సాగు చేయాలి. ఈ పంట అధిక ఉష్ణోగ్రత, అధిక వర్షపాతాన్ని, అధిక మంచును తట్టుకోలేదు.

అనుకూలమైన రకాలు: తీగ రకం: కెంటకీ వండర్, టీకేడీ-1. **పొది రకం:** కంటెండర్, అర్కికోమల్, అర్కసువిధ
నేలలు..: ఇసుకతో కూడిన ఎర్ర గరప, ఒండ్రు నేలలు, నీటి వసతి ఉన్న బరువైన నేలలు అనుకూలం. ఉదజని సూచిక 5-3-6 ఉన్నవి అనుకూలం.

విత్తనాలు, ఎరువులు..

- తీగ రకాలైతే ఎకరానికి 10-12 కిలోలు, పొద రకం ఎకరానికి 20-24 కిలోల విత్తనాలు అవసరం ఉంటాయి. పొలంలో విత్తే ముందు 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్ వినియోగించి కిలో విత్తనాన్ని శుద్ధి చేయాలి.
- దుక్కి దున్ని 30-35 సెం.మీ. దూరంలో బోదెలు వేసుకోవాలి. ఒక్కో వరుసలో 25-30 సెం.మీ. దూరంలో విత్తనాలు నాటాలి.
- ఆఖరి దుక్కిలో ఎకరాకు 8-10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 10 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ చల్లితే ప్రయోజనంగా ఉంటుంది.

చీడపీడల నివారణ..

ఈ పంటకు పలు రకాల తెగుళ్లు ఆశిస్తాయి. తామర పురుగుల నివారణకు ఎసిఫేట్ 300 గ్రా. లేదా ఫిప్రోనిల్ 400 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- పేనుబంక తెగులు ఆశిస్తే మిథైల్ డిమెటాన్ 400 మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రా. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.
- భూమిలో తేమ అధికంగా ఉంటే వేరుకుళ్లు తెగులు ఆశిస్తుంది. లేతమొక్కలు చనిపోతాయి. 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి లేదా 3 గ్రా. థైరామ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు సీఓసీ 3 గ్రా. లేదా మాంకోజెబ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నీటి తడులు..

పూత దశలో ఎకరానికి 10 కిలోల నత్రజనిచ్చే ఎరువులు వేయాలి. అనంతరం నీటి తడులు అందించాలి. నేల స్వభావాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. పూత దశలో తేమ ఎక్కువ, తక్కువ కాకుండా చూసుకోవాలి. సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. తీగ రకాలైతే ఎకరానికి 5-6 టన్నులు, పొదరకం 3-4.5 టన్నుల వరకు వస్తుంది.

రైతేరాజు

సాగులో సందేహాలా?
సంప్రదించాల్సిన ఫోన్ నం: **93815 15588**

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: వరిలో ఆకులపై పసుపు రంగు మచ్చలు కనిపిస్తున్నాయి. నివారణ చర్యలు తెలపండి? – **గోవర్ధన్, తాండూరు**

సమాధానం: ఎండాకు తెగులు సోకితే ఇలాగే జరుగుతుంది. వెంటనే పై పాటుగా నత్రజని ఎరువు వేస్తే ఫలితం ఉంటుంది.

– **న్యూస్‌టుడే, చేర్యాల**

వేరుసెనగలో సస్యరక్షణ కీలకం

నూనె గింజల పంటల సాగులో ప్రధానమైన వేరుసెనగలో సస్యరక్షణ పక్కాగా చేపడితే అధిక దిగుబడి సాధ్యం. ప్రస్తుత యాసంగిలో అత్యధికులు ఈ పంట సాగు చేస్తున్నారు. సెప్టెంబరులో పలువురు దీన్ని పండిస్తున్నారు. ఇప్పటికే మొలకలు వచ్చాయి. ప్రస్తుతం ఆకుముడత, పొగాకు లద్దె పురుగు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. ఆకు ముడత నివారణకు లీటరు నీటికి నొవాల్యురాన్ 1 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దె పురుగు నివారణకు లీటరు నీటికి 5.మి.లీ. వేపనూనె లేదంటే 2 మి.లీ.క్వినాల్‌ఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి. - **న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ**

సమష్టిగా అడుగేస్తూ.. లాభాలు ఆర్జిస్తూ..

సమష్టిగా ముందుకు సాగితే ఏదైనా సాధ్యమే. ఏ రంగంలో నైనా ఇది వర్తిస్తుంది. ఈ సూత్రాన్ని పాటిస్తూ ఆ ఇద్దరు మిత్రులు కలిసి సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వారే నర్సాపూర్ మండలం చిప్పల్తుర్తికి చెందిన మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి. వీరికి పదకరాల పొలం ఉంది. ఐదెకరాలలో వరి, మిగతా దాంట్లో బీర, సొర, కాకరలతో పాటు ఆకుకూరలు పండిస్తున్నారు. మొదట్లో మామూలుగా పండించగా.. ఆ తర్వాత పందిరి సాగు విధానాన్ని పాటిస్తున్నారు. కడీలు పాతించి తీగలు అల్లించారు. అంతర పంటగా ఆకుకూరలు సాగు చేస్తున్నారు.


కాకర తోట


మధుసూదన్‌రెడ్డి


లక్ష్మారెడ్డి

నీటిని నిల్వ చేసుకొని..

పంటలకు అవసరమైన మేర నీటి తడులు అందించాలన్న ఉద్దేశంతో పొలంలో నిల్వ గుంత తవ్వించారు. అందులోకి వాన నీరంతా చేరేలా ఏర్పాట్లుచేశారు. బోరు నీటిని సైతం అందులోకి పారిస్తారు. అందులోనే సేంద్రియ ఎరువులు కలిపి బిందు పరికరాల ద్వారా కూరగాయల మొక్కలకు పారేలా చేస్తున్నారు. ఈ విధానంతో సమయం ఆదా కావడంతో అవసరం మేర మాత్రమే నీటిని వాడుతున్నారు. ఒకే పంట కాకుండా పలు రకాలు సాగు చేయడం వల్ల అంతగా నష్టం వాటిల్లడం లేదు. మూడు నెలల్లో ఆయా రకాలు 300 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. విత్తనాలు, ఎరువులు తదితర వాటికి రూ.1 50 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. దిగుబడులను నర్సాపూర్, హత్నూర మండలం దౌల్తాబాద్, జిన్నారం మార్కెట్లలో విక్రయిస్తున్నారు. రూ.3 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. పెట్టుబడి పోగా రూ.1.50 లక్షల వరకు లాభం మిగులుతోంది. మరోవైపు వరితో రూ.3 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. ఆకుకూరలతో రూ.50 వేల వరకు వస్తున్నాయి.

– **న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్**

పత్తిలో వేరుకుళ్లు తెగులా..

పత్తిలో వేరుకుళ్లు తెగులు అధిక తేమ శాతం కారణంగా ఆశిస్తుంది. దీని నివారణలో నిర్లక్ష్యం చేస్తే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రా.కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా.కార్బెండెజిమ్ కలిపిన ద్రావణాన్ని మొక్కల పాదుల చుట్టూ పిచికారీ చేయాలి. వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు ఇలా చేస్తే తెగులు నివారణ సులభమే.



- **న్యూస్‌టుడే, చేర్యాల**

మెరుగైన సేవలు.. దరిచేరిన పురస్కారాలు

మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు నాణ్యతాప్రమాణాలు పాటిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం కాయకల్ప పురస్కారాలు అందిస్తోంది. 2023-24 సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల నుంచి పలు దవాఖానాలు పురస్కారాలకు ఎంపికై ప్రత్యేకతను చాటడం విశేషం.

న్యూస్‌టుడే, తాండూరు టౌన్, గజ్వేల్, గుమ్మడిదల



అందుబాటులో ఉంటూ..

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సైతం కాయకల్ప అవార్డు దక్కింది. ఇక్కడికొచ్చే రోగులను మర్యాదగా పలకరించి వారి బాధ తెలుసుకొని వైద్య సేవలు అందించడం ఇక్కడి వైద్యులు, సిబ్బంది అలవాటు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఎక్కడా రాజీ పడటం లేదు. ఈ కేంద్రానికి నిత్యం 70 నుంచి 100 మంది వరకు పేషెంట్లు వస్తున్నారు. అవసరమైన వారిని జిల్లా కేంద్రానికి రిఫర్ చేస్తున్నారు. మరోవైపు కేంద్రం పరిధిలో గర్భిణుల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని తగు చర్యలు తీసుకుంటున్నారు. అవార్డు కింద రూ.2 లక్షలు రానున్నాయి. ఈ నగదుతో ఆసుపత్రిలో రోగులకు అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తామని వైద్యులు మధుకర్, విజేతలు తెలిపారు.

పారిశుద్ధ్యం నిర్వహణలో భేష్



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి ఇప్పటివరకు మూడుసార్లు వరుసగా కాయకల్ప అవార్డులు దక్కాయి. ఈ సారి ద్వితీయ స్థానంలో నిలిచింది. పరిసరాల పారిశుద్ధ్యం, వైద్య వ్యర్థాల నిర్వహణ, వార్డుల పర్యవేక్షణ తదితర 8 విభాగాల్లో మెరుగైన సేవలు అందిస్తున్నందుకు ఇందుకు ఎంపికైంది. రూ.40 కోట్లతో 100 పడకల సామర్థ్యంతో ఈ ఆసుపత్రిని నిర్మించారు. ప్రస్తుతం నెలకు 350 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. చిన్నపిల్లల ఐసీయూ, వృద్ధులకు మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్ర చికిత్సలు సైతం చేస్తున్నారు. క్యాన్సర్ రోగుల కోసం పాలియేటివ్ వార్డు, 7 పడకల సామర్థ్యంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటయ్యాయి. నెలకు 15 వేల మందికి పైగా ఓపీ, 600 మంది వరకు ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు. పరిసరాలు, ఆవరణ, వార్డులు పరిశుభ్రంగా ఉంచుతున్నారు. నిత్యం 500 కిలోల సాధారణ వ్యర్థాలను బల్దియా సేకరిస్తుండగా, రెండురోజులకో సారి 500 కిలోల బయో వ్యర్థాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఆవరణ మొక్కలతో వనాన్ని తలపిస్తోంది.

ముందంజలో నిలిచి..

వికారాబాద్ జిల్లా తాండూరులో 20 ఏళ్ల కిందట 200 పడకలతో జిల్లా స్థాయి ఆసుపత్రిని నిర్మించారు. నిత్యం జిల్లా వాసులతో పాటు మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, సరిహద్దు రాష్ట్రం కర్ణాటక నుంచి ప్రజలు ఇక్కడికి వైద్యసేవల నిమిత్తం వస్తుంటారు. రోజూ 800 మందికి పైగా సేవలు పొందుతున్నారు. 100 మంది వరకు ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. వైద్యులు, సిబ్బంది బాధితుల ఇబ్బందులను తెలుసుకొని అందుకు అనుగుణంగా చికిత్స అందిస్తూ ఉపశమనం కలిగిస్తున్నారు. మెరుగైన వైద్య సేవలతో పాటు పరిసరాల శుభ్రత తదితర అంశాల్లో ముందంజలో నిలుస్తోంది. తద్వారా రాష్ట్ర స్థాయిలో అవార్డులు దక్కుతున్నాయి. తొలిసారిగా 2021లో కాయకల్ప అవార్డుకు ఎంపికైంది. 2022లో రెండో సారి, తాజాగా ఈ ఏడాది మూడో సారి అవార్డు దక్కించుకుంది.


ఆసుపత్రిలోని వార్డు

- ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో మెరుగ్గా ఉండటంతో రాష్ట్ర స్థాయిలో తొలిస్థానంలో నిలిచింది. కాయకల్ప అవార్డు రూ.25 లక్షలు రానున్నాయి. వీటితో వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందించనున్నామని ఆసుపత్రి పర్యవేక్షకుడు శంకర్ తెలిపారు.

పద్య సాహిత్యం సమాజానికి అవసరం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పద్య సాహిత్యం సమాజానికి ఎంతో అవసరమని అవధాని, పద్యసారస్వత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అవుసుల భానుప్రకాశ్ అన్నారు. పద్యం ద్వారానే బాలలు నీతి నిజాయతీ, న్యాయం నేర్చుకుంటారన్నారు. ఆయన రచించిన 'ట్రెండింగ్ పద్యాలు' పుస్తక పరిచయ సభ సిద్దిపేటలోని వ్యాసమహర్షి యోగా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్ మాట్లాడారు. బాలల నుంచి యువత, వృద్ధుల వరకు చదివే పుస్తకం ట్రెండింగ్ పద్యాలు అని అన్నారు. కవి ఐతా చంద్రయ్య మాట్లాడుతూ సంప్రదాయాలకు అనుగుణంగా సాహిత్య రచనలు ఉండాలన్నారు. మరో కవి కొమురవెల్లి అంజయ్య మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా రచనలు రావాలన్నారు. కార్యక్రమంలో గోగులపాటి కృష్ణమోహన్, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, సింగీతం నరసింహారావు, సరస్వతీ రామశర్మ, బస్వ రాజ్‌కుమార్, కాంతికృష్ణ, నాగలత, యాదగిరి, మహేందర్ రెడ్డి, బాలచంద్రం, అంజిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ట్రెండింగ్ పద్యాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ప్రపంచ సుడోకు పోటీలకు జైపాల్‌రెడ్డి

జహీరాబాద్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన భాజపా నాయకుడు, మెదక్ డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఎం. జైపాల్‌రెడ్డి, ఆయన తనయుడు కార్తీక్‌రెడ్డి ప్రపంచ సుడోకు, పజిల్ పోటీలకు ఎంపికయ్యారు. చైనా బీజింగ్‌లో ఈ నెల 14 నుంచి వారం పోటీలు జరగనున్నాయి. లాజిక్ మాస్టర్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఏడాది పాటు ఆన్‌లైన్ ద్వారా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని 50 మందిని గుర్తించి, వీరికి గత ఆగస్టు 10,11 తేదీల్లో బెంగళూరులో పోటీలు నిర్వహించి నలుగురు ఎంపిక చేయగా, అందులో జహీరాబాద్‌కు చెందిన వారు ఇద్దరు ఉండటం విశేషం.


జైపాల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

మనోవేదనతో వృద్ధుడు..

రామాయంపేట: పక్షవాతంతో బాధపడుతున్న ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. రామాయంపేట ఎస్ఐ పుట్టి స్వామి తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన పుట్టి స్వామి (58) పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మనోవేదనకు గురై ఆదివారం ఇంటి నుంచి వెళ్లాడు. స్థానిక కొత్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు అన్ని చోట్ల వెతకగా సోమవారం స్థానిక చెరువులో మృతదేహం కనిపించింది. కుమారుడు సాయికుమార్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

క్యాన్సర్ తగ్గక వృద్ధుడు..


నాగయ్య

మనోహరాబాద్: క్యాన్సర్‌తో బాధపడుతున్న మనోహరాబాద్‌కు చెందిన తూం నాగయ్య(60) ఇంట్లోనే ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. నాగయ్య కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. రెండేళ్లుగా పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా తగ్గలేదు. ఈ నెల 4న ఇంట్లో ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన అతడి భార్య ములుగులోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడు మల్లేశ్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మద్యం మత్తులో యువకుడు..


రాకేష్

బెజ్జంకి: మద్యం మత్తులో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని దాచారానికి చెందిన చెందిన బొర్ర రాజు, సరవ్వ చిన్న కుమారుడు రాకేష్ (20) పదో తరగతి వరకు చదివి మానేశాడు. కూలీ పనులతో పాటు హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఆదివారం రాత్రి భోజనం చేశాక పడక గదిలోకి వెళ్లాడు. వెంటిలేటర్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించగా.. కుటుంబీకులు గమనించి కిందికి దించి సీపీఆర్ చేశారు. అప్పుడే చేరుకున్న 108 వాహన సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లు తేల్చిచెప్పారు. ఇంటికొచ్చిన కొడుకు అరగంట వ్యవధిలోనే విగతజీవిగా మారడంతో కుటుంబీకులు బోరున విలపించారు. సోమవారం కేసు నమోదైంది.

బావిలో పడి మహిళ మృత్యువాత

రామాయంపేట: ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిన ఓ మహిళ మృతి చెందింది. రామాయంపేట ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాలు.. లక్ష్మాపూర్‌కు చెందిన కాసుల నాగవ్వ (53) ఆదివారం రాత్రి తమ పొలానికి వెళ్లింది. అడవి పందుల నుంచి కాపలాకు బ్యాటరీ లైట్‌తో పొలంలో తిరుగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయింది. సోమవారం ఉదయం కుమారుడు దుర్గరాజు పొలానికి వెళ్లగా తల్లి నాగవ్వ కనిపించలేదు. బావి గట్టుపై చెప్పులు, బ్యాటరీ పడి ఉన్నాయి. అందులో వెతకగా నాగవ్వ మృతదేహం లభ్యమైంది. దుర్గరాజు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చేపల వేటకు వెళ్లి యువకుడు..


యాదగిరి

పాపన్నపేట: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని యూసుఫ్‌పేటకు చెందిన రొడ్డ యాదగిరి(31) రైతు. సోమవారం పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

ఫుట్‌బాల్ ఫైనల్‌కు రంగారెడ్డి జట్టు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మెదక్‌లో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, పోటీల కోఆర్డినేటర్ నాగరాజు ఆధ్వర్యంలో రెండో రోజు సోమవారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, వెస్లీ పాఠశాల మైదానంలో పోటీలు హోరాహోరీగా జరిగాయి. మొత్తం 10 జట్లు పాల్గొనగా, రెండు గ్రూప్‌లుగా విభజించి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. లీగ్ దశలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్ నిజామాబాద్-రంగారెడ్డి జట్ల మధ్య జరిగింది. ఇందులో రంగారెడ్డి జట్టు ఫైనల్‌కు వెళ్లింది. మరో సెమీఫైనల్ పోటీ మంగళవారం మెదక్, ఆదిలాబాద్ జట్ల మధ్య జరగనుంది. ఇందులో గెలుపొందిన జట్టు రంగారెడ్డితో ఫైనల్‌లో ఆడనుంది. రెండో రోజు పోటీలను మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ప్రారంభించారు. పోటీలకు సినీ నిర్మాత సుధాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసరావు, సిద్దార్థ విద్యా సంస్థల అధినేత శ్రీనివాస్ చౌదరిలు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పీడీలు మాధవరెడ్డి, చంద్రమోహన్, శ్యామయ్య, రాజేందర్, సత్యం, దేవేందర్‌రెడ్డి, రవి, పద్మ, సరోజిని, మహిపాల్ తదితరులు ఉన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న మెదక్ డీఈవో రాధాకిషన్

ఆగిన కుంచె.. మూగపోయిన కంఠం


నర్సింలు

వికారాబాద్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడు నర్సింలు మృతితో చిత్రాలకు జీవం పోసే కుంచె ఆగిపోయింది. సమాజాన్ని చైతన్యపరిచే కలం నుంచి జాలువారిన గీతాలు, ఆలపించిన కంఠం మూగపోయింది. వికారాబాద్ పుర పరిధి గిరిగిట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మర్పల్లి మండలం కల్కోడకు చెందిన నర్సింలు (50) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడే అయినా ప్రవృత్తిలో చిత్రకళాకారుడిగా, గాయకుడుగా, పాటల రచయితగా అందరికీ సుపరిచితుడు. సమాజాన్ని మేల్కొలిపే బాలల హక్కులు, మూఢనమ్మకాలు, అక్షరాస్యత, తెలంగాణ ఉద్యమంపై ఎన్నో పాటలు రాసి అవార్డులు అందుకున్నారు. ఎంతో మందికి చిత్రలేఖనంలో మెలుకువలు నేర్పించారు. ఆయన మృతికి శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

కళా ఉత్సవ్ పోటీల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఏక్ భారత్ - శ్రేష్ట్ భారత్‌లో భాగంగా ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో సిద్దిపేట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చూపారు. క్లస్టర్ స్థాయి బృందగానం పోటీల్లో ప్రథమ, బృందనృత్యంలో ద్వితీయ స్థానంలో నిలిచారని విద్యాలయ ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్, కో-ఆర్డినేటర్లు సంధ్య, పీఈటీ భూమయ్య తెలిపారు. ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో నిర్వహించే రీజినల్ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

స్టాన్‌ఫోర్డ్ శాస్త్రవేత్తల జాబితాలో అళగర్ స్వామికి చోటు



సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి గ్రామీణ, న్యూస్‌టుడే: సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అళగర్ స్వామి స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రకటించిన ప్రపంచ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ విశ్వవిద్యాలయం సెప్టెంబరు 15న జాబితా ప్రకటించగా.. కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.ఎన్. రాజు మాట్లాడుతూ.. అళగర్ స్వామి యాంటీ వైరల్ మెడిసిన్స్ ఫార్మసీలో పరిశోధన చేసినందుకు ప్రపంచ ర్యాంకింగ్‌లో స్థానం దక్కినట్లు పేర్కొన్నారు. 2020 నుంచి ఈ ఏడాది వరకు వరుసగా అయిదు సార్లు జాబితాలో చోటు కల్పించారని, ర్యాంకింగ్స్‌లో తెలంగాణలో ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. గ్లోబల్ ర్యాంకు 1,48,458, పరిశోధనల్లో 1,795 ర్యాంకు సాధించారన్నారు. ఆయన పలు రకాల పుస్తకాలు రాసి జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కించుకున్నారన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ రవివర్మ తదితరులు అళగర్ స్వామిని అభినందించారు.



బతుకమ్మ సంబురం.. ఆనందం అంబురం

తాండూరు పట్టణంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. శాంతినగర్ కాలనీలోని మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పాటలు పాడుతూ కోలాటం, దాండియా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణ శివారులోని కాగ్నా నదిలో నిమజ్జనం చేశామని స్నేహ బృందం ప్రతినిధి అనురాధ తెలిపారు. **- న్యూస్‌టుడే, పాత తాండూరు**

సాగు పెరిగేలా.. అవగాహన పెంపొందించేలా..


● నేడు ఎఫ్ఆర్ఎస్‌లో డ్రాగన్ ఫ్రూట్ మేళా


డ్రాగన్ ఫ్రూట్ తోట

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

డ్రాగన్ ఫ్రూట్‌లో ఆరోగ్యానికి మేలు చేసే గుణాలెన్నో ఉన్నాయని వైద్య నిపుణులు సూచిస్తుంటారు. ఇటీవలి కాలంలో మార్కెట్‌లో ఈ ఫలాలకు డిమాండ్ పెరిగింది. డ్రాగన్ పండ్ల తోటలు సాగు చేసిన రైతులకు సైతం లాభాలు అదే స్థాయిలోనే ఉంటున్నాయి. అయితే సరైన అవగాహన లేక దీని సాగు అంతంతే ఉంది. అత్యధిక మంది రైతులు వెనుకడుగే వేస్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించే లక్ష్యంతో సంగారెడ్డిలోని ఫల పరిశోధనా స్థానం అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా డ్రాగన్ ఫ్రూట్ మేళాను మంగళవారం నిర్వహించనున్నారు.


డ్రాగన్ ఫ్రూట్


పూత దశలో

కొనసాగుతున్న పరిశోధనలు..

సంగారెడ్డిలోని కొండా లక్ష్మణ్ ఫల పరిశోధనా స్థానం (ఎఫ్ఆర్ఎస్)లో డ్రాగన్ ఫ్రూట్‌పై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇందుకు ప్రత్యేక బ్లాక్ ఏర్పాటుచేసి వివిధ రకాల మొక్కలను నాటి పెంచారు. ఇటీవలే ఫలసాయం సైతం వచ్చింది. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ఇక్కడి నేలలు అనుకూలమని తమ పరిశోధనల్లో ఇక్కడి శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో 142 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. కొండాపూర్, నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి మండలాల్లో సాగు చేస్తున్నారు. సాగు విస్తీర్ణం పెంపు లక్ష్యంగా మేళాను నిర్వహిస్తున్నారు.

అభ్యుదయ రైతులు.. ఔత్సాహికులు

మేళాలో డ్రాగన్ ఫ్రూట్‌కు చెందిన పలు రకాలను ప్రదర్శించనున్నారు. ఇప్పటికే దీన్ని సాగు చేస్తున్న రైతులతో పాటు ఈ పంట సాగుపై ఆసక్తి ఉన్న వారినీ మేళాకు ఆహ్వానించారు. ఈ పంట సాగుతో ఉన్న ప్రయోజనాలు, ప్రతికూలతలను అభ్యుదయ రైతులు వివరిస్తారు. ఎదురయ్యే ఇబ్బందులు, ఎలా అధిగమించాలన్న అంశాలపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందించనున్నారు. మార్కెటింగ్ సదుపాయం కూడా మెరుగ్గా ఉన్న నేపథ్యంలో దీని సాగుకు ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించారు. ఉద్యాన శాఖ సంచాలకురాలు యాస్మిన్ భాషా, విశ్వవిద్యాలయం ఉప కులపతి నీరజ ప్రభాకర్, ఎఫ్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సుచిత్ర తదితరులు పాల్గొని పలు అంశాలను వివరించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం


సంతోష్

మనోహరాబాద్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మేడోజీ సంతోష్‌చారి(36) ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన మిత్రుడి పుట్టినరోజు వేడుకలకు దండుపల్లి వెళ్లి తిరిగి బయల్దేరాడు. దండుపల్లి చౌరస్తా వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం సంతోష్‌ను ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మరొకరు..


సాయిలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లంపేట గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు.. కొత్తలింగాయిపల్లి గ్రామానికి చెందిన కొల్కూరి సాయిలు(48) హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పండగ నిమిత్తం సోమవారం తన ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి ఇంటికి బయలుదేరాడు. మల్లంపేట గ్రామ శివారులోని మలుపు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తల, శరీరానికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీతో పాటు కూతురు, కొడుకు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పురపాలక సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

నియోజకవర్గ ప్రగతిపై దృష్టి

తూప్రాన్: గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. సోమవారం తూప్రాన్ 16వ వార్డు కౌన్సిలర్ నారాయణగుప్తా ఆధ్వర్యంలో పురపాలిక సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. పురపాలిక ఛైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రవీందర్ గుప్తా, మున్సిపల్ మేనేజర్ రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సలకు ఆసరా



నర్సాపూర్‌లో ఎల్‌వోసీ అందజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

నర్సాపూర్, న్యూస్‌టుడే: పేదల వైద్య చికిత్సలకు సీఎం సహాయ నిధి దోహదపడుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. నర్సాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో హత్నూర మండలం బోర్పట్ల గ్రామానికి చెందిన నాగరాణికి రూ.2.25 లక్షలు, నర్సాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన సువర్ణకు రూ.1.25 లక్షల సీఎం సహాయనిధి ఎల్‌వోసీ పత్రాలను సోమవారం అందించారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి



శిక్షణ కర దీపికను ప్రదర్శిస్తున్న అధికారులు

కొల్చారం, నర్సాపూర్: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి చేయాలని కొల్చారం, చిలప్‌చెడ్, నర్సాపూర్ ఎంపీడీవోలు కృష్ణవేణి, ఆనంద్, మధులత అన్నారు. సోమవారం పోతంశెట్టిపల్లి రైతు వేదిక, నర్సాపూర్‌లోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామీణ నీటి సహాయకులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో వారు మాట్లాడుతూ. నాలుగు రోజులపాటు వాటర్‌మెన్లకు శిక్షణ ఉంటుందన్నారు. మొదటిరోజు మోటార్లు, వాటి మరమ్మతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు శ్రీకాంత్, అన్వేష్ రెడ్డి, నర్సాపూర్ మిషన్ భగీరథ ఈఈ సంపత్‌కుమార్, డీఈలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఏఈ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిసిపట్టారు.. రక్షణ కల్పించారు..



అటవీ ప్రాంతంలో తవ్విన కందకాల్లో నిలిచిన వర్షపు నీరు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: అడవుల రక్షణకు ఆ శాఖ అధికారులు ఎన్నో చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా అడవుల్లోకి వాహనాలు వెళ్లకుండా చుట్టూ కాల్వలు తవ్వడం, కందకాలు తవ్వి వర్షం నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాదు ఊట చెరువులను పునరుద్ధరించడంతో పచ్చదనం సంతరించుకుంటోంది.

వర్షాకాలంలో కురిసిన నీరు కాల్వలు, కందకాలు, ఊట చెరువుల్లో నిల్వ ఉండడంతో అటవీ ప్రాంతంలో తేమ శాతం పెరుగుతుంది. తద్వారా చెట్లు ఏపుగా పెరుగుతాయి. జంతువులకు తాగునీటి సమస్య ఉండదు. అవి జనవాసాల్లోకి రాకుండా ఉంటాయి. అలాగే కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుంది. ఇలా బహుళ ప్రయోజనాలు ఉన్నాయి.

వాహనాలు వెళ్లకుండా అడ్డుకట్ట..

ఉమ్మడి వెల్దుర్తి మండలంలో వేలాది ఎకరాల్లో ఫారెస్టు ఉంది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో అడ్డగోలుగా చెట్లను నరికి కలపను తరలించుకుపోయేవారు. అక్కడి ప్రజలను ఆసరా చేసుకుని కలప దొంగలు అడవుల్లోకి చొరబడేవారు. ప్రస్తుతం ఇళ్లలో వంట గ్యాస్ వాడకం పెరగడంతో 90 శాతం వంటచెరకు వాడకం తగ్గింది. అలాగే అడవుల చుట్టూ శాఖ అధికారులు కాల్వలు, కందకాలు తవ్వి లోనికి వాహనాలు వెళ్లకుండా అడ్డుకట్ట వేస్తున్నారు.

చెరువుల పునరుద్ధరణ

గతంలో నిర్మించిన ఊట చెరువులు శిథిలం కాగా వాటిని పునరుద్ధరించారు. వర్షం కురిసినప్పుడు అడవి చుట్టూ తవ్విన కాల్వలు, అంతర్గత ప్రదేశంలో తవ్విన కందకాలు, ఉన్న ఊట చెరువుల్లో నీరు నిల్వ ఉంటోంది. ఇలా చేయడంతో వాటికి రక్షణ ఉంటోంది. ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని వెల్దుర్తి, చెర్లపల్లి, దామరంచ, ధర్మారం, అందుగులపల్లి, మానేపల్లి, మంగళపర్తి, శెట్టిపల్లికలాన్, ఏదులపల్లి, బండపోసానిపల్లి, హస్తాల్‌పూర్, శంశిరెడ్డిపల్లి తండా, అచ్చంపేట ప్రాంతాలు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి.



నిండుగా దామరంచ ఊట చెరువు

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్ 95730 81675
నర్సాపూర్ 80085 73222
తూప్రాన్ 96762 58144
చేగుంట 80085 73200
పెద్దశంకరంపేట 80085 73251
రామాయంపేట 94402 31031
(10AM TO 1 PM)

న్యూస్‌టుడే, అల్లాదుర్గం: ? అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లికి సరఫరా చేసే ఓవర్ హెడ్ నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. సిమెంటు పెచ్చులూడి ప్రమాదకర స్థితిలో ఉంది. - ప్రవీణ్, అప్పాజీపల్లి
✔ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – రఘునాథ్, మిషన్ భగీరథ ఏఈ, అల్లాదుర్గం

న్యూస్‌టుడే, శివ్వంపేట: ? శివ్వంపేటలో వీధి దీపాలు వెలగక అంధకారం ఏర్పడింది. చీకట్లో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. – సత్యనారాయణ, శివ్వంపేట
✔ పరిశీలించి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. సమస్య పరిష్కరిస్తాం. – రమాదేవి, కార్యదర్శి, శివ్వంపేట



చేగుంటలో..

స్వయం సేవకుల పథ సంచాలన్

చేగుంట, హవేలిఘనపూర్: హిందూ ధర్మం ఒక జీవన విధానమని ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ్ సహ కార్యవాహ బొల్లి నర్సింహులు అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేగుంటలో, హవేలిఘనపూర్‌లో సోమవారం స్వయం సేవకుల పథ సంచాలన్ నిర్వహించారు. చేగుంటలో నర్సింహులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దేశభక్తి ఉండాలన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే

వెల్దుర్తి: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి కుకునూర్ గ్రామానికి చెందిన నర్సింలు అనారోగ్యంతో చికిత్స చేయించుకోగా రూ.15 వేలు, వెల్దుర్తికి చెందిన గంగామణికి రూ.33 వేల ఎల్‌వోసీ పత్రాలను వెల్దుర్తిలో అందజేశారు. భారాస జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, పాండురంగం, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

9న చలో కలెక్టరేట్

వెల్దుర్తి(మాసాయిపేట), న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలు విషయంలో ముఖ్యమంత్రి అవలంబిస్తున్న నిర్లక్ష్యం వైఖరికి నిరసనగా ఈ నెల 9న చేపట్టనున్న హలో మాదిగ.. చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాసాయిపేట యాదగిరి మాదిగ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగ నియమాకాలు చేపట్టడం తగదన్నారు.

రోడ్డుపైనే మక్కల ఆరబోత



రైతులు మొక్కజొన్న కోసి జూళ్లు తీసి కంకులను యంత్రాలతో నూర్పిడి చేస్తున్నారు. తరవాత మక్కలను రహదారుల వెంట ఎండబెడుతున్నారు. దీంతో రోడ్లు ఒక పక్క బంగారు వర్ణంలో కనిపిస్తున్నాయి. చేగుంట, నార్సింగి, మాసాయిపేట మండలాల్లో చాలా రహదారుల వెంట అన్నదాతలు మక్కలను ఎండబెడుతున్నారు.– న్యూస్‌టుడే, చేగుంట

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

కొల్చారం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని ఆ సంఘం సంక్షేమ అధ్యక్షుడు ఎత్తిరి మారయ్య అన్నారు. కొల్చారంలో మండల అధ్యక్షుడు జరిపేటి రాజు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం వడ్డెరలను బీసీ ఏ నుంచి తొలగించి ఎస్టీ జాబితాలో కలపాలన్నారు.

తపస్ మండల అధ్యక్షుడిగా శ్రీహరి

చిన్నశంకరంపేట న్యూస్‌టుడే: చిన్నశంకరంపేట మండల తపస్ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎల్లం, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా నరేందర్, ఉపాధ్యక్షులుగా భాస్కరరావు, లక్ష్మి, కిషన్, వెంకటేష్, కార్యదర్శులుగా నవిత, మంగారాణి, ప్రమోద్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఓటు నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలి

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ గ్రేస్‌బాయి తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే ఎన్నికల్లో ఓటు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ ఓటును నవంబర్ 6వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో కూడా అవకాశం ఉందన్నారు.

కార్మికుల పక్షాన నిరంతర పోరాటం

కౌడిపల్లి, న్యూస్‌టుడే: సీఐటీయూ నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతుందని జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు తెలిపారు. సోమవారం కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట చౌరస్తాలో ఆటో యూనియన్ కార్మికులకు సీఐటీయూ స్టిక్కర్లను అందజేశారు. కార్మికులకు ఆటో యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధ్యక్షుడు అశోక్, ఆటో చోదకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సాయం

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: సంగాయపల్లిలో నిర్మిస్తున్న ఎల్లమ్మ దేవాలయానికి భారాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం గ్రామ గౌడ సంఘం నాయకులకు అందజేశారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన సుహాసినిరెడ్డి

కౌడిపల్లి, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలిగా నియమితులైన చిలుముల సుహాసినిరెడ్డి కుటుంబీకులు సోమవారం నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మదన్‌రెడ్డి సుజాత దంపతులను సన్మానించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు శేషసాయిరెడ్డి దంపతులు ఉన్నారు.

నూతన కార్యవర్గం

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: చిలప్‌చెడ్ మండల కెమిస్టు, ఫార్మసిస్టు సంఘం అధ్యక్షుడిగా రెడ్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా గణేష్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని చిట్కుల్ శివారులో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ.. సంఘ పరిధిలో సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..



పాపన్నపేట మండలం కొడుపాకలో..



శివ్వంపేట మండలం దొంతిలో..

చేగుంట, పాపన్నపేట, శివ్వంపేట, పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: జిల్లాలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. చేగుంటలోని ఎన్‌జీవో కాలనీలో ఆదివారం రాత్రి 12 గంటల వరకు వేడుకలను జరిపారు. నిర్వాహకులు మహిళలు, పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. చేగుంటకు చెందిన అయిత పరంజ్యోతి కార్యక్రమం కొనసాగింది. శివ్వంపేటలో మండల ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు, దొంతి ప్రత్యేక అధికారి సంతోష ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. పెద్దశంకరంపేట తహసీల్దార్ ఆవరణలో ఉద్యోగినులు బతుకమ్మ ఆడారు. చిలప్‌చెడ్, పాపన్నపేట మండలాల్లో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి సాయంత్రం కూడళ్ల వద్ద ఆడారు. అనంతరం స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

ఏఈగా శ్రీకాంత్ నియామకం

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: అల్లాదుర్గం మండలంలోని చేవెళ్ల గ్రామానికి చెందిన యువకుడు రజినీకాంత్ సోమవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

నర్సాపూర్ రురల్, న్యూస్‌టుడే: రెడ్డిపల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. దాత మాజీ ఉప సర్పంచి అశోక్ గౌడ్ సహకారం అందించారు. ప్రతి పండుగకు అశోక్ గౌడ్ సేవా కార్యక్రమాలు చేస్తారన్నారు.

దివ్యదర్శిని.. శక్తి స్వరూపిణి

మెదక్ అర్బన్, నర్సాపూర్, చేగుంట, పాపన్నపేట, కౌడిపల్లి, పెద్దశంకరంపేట, శివ్వంపేట, అల్లాదుర్గం, నర్సాపూర్, వెల్దుర్తి, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం మెదక్ పట్టణ శివారు పసుపులేరు ఒడ్డున వెలిసిన రేణుకాంబ ఎల్లమ్మ ఆలయంలో అర్చకులు వేదవ్యాస్, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన చేపట్టారు. మాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నర్సాపూర్ దుర్గామాత ఆలయంలో అమ్మవారు మహా చండీదేవిగా, నార్సింగిలో శాకంబరిగా, పాపన్నపేటలో మహాలక్ష్మిగా, కౌడిపల్లి మండలం వెల్మకన్నెలో విద్యా సరస్వతి దేవి లలితా పరమేశ్వరీ దేవిగా, పెద్దశంకరంపేట గడికోటలో, నర్సాపూర్ మహాచండీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. గడికోటలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూజలు చేశారు. వెల్దుర్తి మండలం మానేపల్లి, వెల్దుర్తిలో రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు. శివ్వంపేట మండలం గోమారంలో గుడ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో భజనలు చేపట్టారు. పలు గ్రామాల్లో కోలాటం ఆడారు. మండలి భజనలు ఆకట్టుకున్నాయి. అల్లాదుర్గంలో కుంకుమార్చాన చేశారు.



పెద్దశంకరంపేట గడికోటలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూజలు



మెదక్‌లో అమ్మవారి సన్నిధిలో మాలధారులు



వెల్మకన్నెలో లలితా పరమేశ్వరీ దేవి



నార్సింగిలో శాకంబరి అలంకరణ

టెలికాం బోర్డు సభ్యుడికి సన్మానం

చేగుంట: జిల్లా టెలికాం బోర్డు సలహా సంఘం సభ్యుడిగా నియామకమైన మంద బాలచంద్రంను చేగుంట ఏఎంసీ మాజీ ఛైర్మన్ రజనకు ప్రవీణ్‌కుమార్ సోమవారం సన్మానించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

దుబ్బాక, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ఎనిమిది నెలలు దాటిన గర్భిణులకు కత్తి కార్తీక ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మా ఇంటి మహాలక్ష్మి' పేరుతో పోషకాహార కిట్లను సోమవారం దుబ్బాక మండలంలోని అచ్చుమాయిపల్లి, పర్శరాంనగర్, పెద్దచీకోడ్ గ్రామాల్లోని 10 గర్భిణులకు భారాస నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ అందజేశారు. ఈ కిట్లలో 4 డబ్బాల పాలు, రాగి పిండి, బెల్లం, కొబ్బరి, ఖర్జూర పండ్లు మొదలైన ఆహార పదార్థాలను ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనిచ్చే అవకాశం ఉంటుందన్నారు. స్వామి, దేవిరెడ్డి, చంద్రం, ప్రసాద్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జూద స్థావరంపై దాడి.. ఏడుగురి అరెస్టు

దుబ్బాక, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దచీకోడ్ గ్రామ శివారులో సోమవారం సాయంత్రం జూదం ఆడుతున్న స్థావరంపై పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు జూదం ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో దుబ్బాక, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి, ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,470 నగదు, 7 చరవాణులు, 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎస్సై గంగరాజు మాట్లాడుతూ.. ఎవరైనా జూదం, మట్కా, బెట్టింగ్‌లు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే, తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

8న ఆయిల్‌పామ్‌పై అవగాహన

శివ్వంపేట, న్యూస్‌టుడే: నర్సాపూర్ డివిజన్ రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై ఈ నెల 8న మండల రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహిస్తామని జిల్లా ఉద్యాన శాఖ ఆయిల్ పామ్ క్షేత్ర అధికారి అజయ్ కుమార్, ఏఈవో మాజీద్ అలీ తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ హాజరవుతారన్నారు.

ముస్లాపూర్‌లో క్రికెట్ టోర్నీ

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: మండల పరిధి ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఆయా యువజన సంఘాల నాయకులు సోమవారం క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు టేక్మాల్ మండలంలోని పలు గ్రామాల యువకులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కిరాణ దుకాణాల తనిఖీ

చేగుంట, న్యూస్‌టుడే: చేగుంటలో పలు కిరాణ దుకాణాలను ఫుడ్ సేఫ్టీ జిల్లా ఇన్‌ఛార్జి శ్రీశాంక సోమవారం తనిఖీ చేశారు. ముందుగా సూపర్‌మార్కెట్లను పరిశీలించారు. అల్లం పేస్టులను క్షుణ్ణంగా చూశారు. అనంతరం పలు దుకాణాల్లో సరకులపై ఆరా తీసి పలు చోట్ల శాంపిళ్లను తీసుకెళ్లారు.

చెట్లు నరికిన వ్యక్తిపై కేసు

రామాయంపేట, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా వేపచెట్టు నరికిన నిజాంపేటకు చెందిన రామస్వామికి జరిమానా విధించడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు రామాయంపేట ఎఫ్‌ఆర్‌ఓ విద్యాసాగర్ తెలిపారు. రామస్వామి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పొలం వద్ద అటవీ అనుమతులు లేకుండా నాలుగు వేప చెట్లు కొట్టాడు. ఫిర్యాదు మేరకు అటవీ అధికారులు పరిశీలించి రూ.24900 జరిమానా విధించి కేసు నమోదు చేశారు.

బకాయి వేతనాలు విడుదల చేయాలని నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల నినాదాలు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....సకాలంలో వేతనాలు రాకపోవడంతో కార్మికులు బతుకమ్మ, దసరా వంటి పండుగలను చేసుకునేందుకు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు లాలు, రంగనాయక్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాధికారికి వినతి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన వేతనాలను చెల్లించాలని ఆ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత 5 నెలల నుంచి మెనూ చార్జీలు సైతం రాకపోవడంతో అప్పులు చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పద్మ, యాదమ్మ, బేగం, సత్తమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత కార్మిక అధికారిని నియమించాలి: సీఐటీయూ

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: మెదక్ ప్రాంతానికి శాశ్వత అసిస్టెంట్ కార్మిక అధికారి (ఏఎల్‌వో)ను నియమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. శాశ్వత కార్మిక అధికారి లేకపోవడంతో మెదక్ ప్రాంతానికి చెందిన కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. టేక్మాల్, పాపన్నపేట, అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట, మెదక్ మండలాల్లో ఇటుక బట్టీల్లో పని చేసే వారు, అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులు అధికంగా ఉన్నారని తెలిపారు. వారిపై పర్యవేక్షణ లేక నిర్వాహకులు కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి శాశ్వత అధికారిని కేటాయించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



విఠల్

పాపన్నపేట, న్యూస్‌టుడే: మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కొడుపాక గ్రామానికి చెందిన బూసనెల్లి విఠల్ (66) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. విఠల్ రెండేళ్లుగా మద్యానికి బానిసగా మారాడు. మద్యం మత్తులో తరచూ కుటుంబీకులతో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి మళ్లీ తగాదా చోటుచేసుకోగా కుటుంబీకులు పనిచేసుకోవాలని చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే అందరూ నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో పురుగు మందు తాగాడు. కుటుంబీకులు గమనించి 108లో మెదక్, అక్కడ్నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై వెల్లడించారు.

వేలాడుతున్న తీగలు.. ప్రమాదానికి సంకేతాలు



ముప్పిరెడ్డిపల్లి రహదారిపై..



టేక్మాల్‌లో పొలాల్లో...

విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం పొంచి ఉంది. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధి కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల మధ్య రహదారి వెంట విద్యుత్తు స్తంభాలకు పిచ్చి మొక్కలు ఎర్తింగ్ తీగను అల్లుకుని తీగలపై పైకి వెళ్తున్నాయి. రహదారిలో పలు స్తంభాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఒక వైపునకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. విద్యుత్తు సిబ్బంది భారీ వృక్షాలు నరికేసి చిన్న వాటిని మాత్రం పట్టించుకోవడం లేదు.

- టేక్మాల్ మార్కెట్ ఆవరణకు దగ్గరలో వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. స్తంభాల మధ్య దూరం ఎక్కువ ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు పనులు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పొలాలు దున్నే సమయాల్లో ట్రాక్టర్‌కు, వరి నూర్పిడి చేసేటప్పుడు వరి కోత యంత్రాలకు తీగలు తగులుతున్నాయని రైతులు వాపోతున్నారు. వెంటనే కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ ఉదయ భాస్కర్‌ను వివరణ కోరగా.. ప్రస్తుతం పంటలు సాగవుతున్నాయని, పూర్తి కాగానే సమస్య పరిష్కరిస్తామన్నారు.

-న్యూస్‌టుడే, మనోహరాబాద్, టేక్మాల్